క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
15 ANNIVERSARY
హైదరాబాద్
21-7-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 113
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## 'కాజీపేట' నిర్వహణ ప్రైవేటుకు?



- కోచ్ ఫ్యాక్టరీ నిర్వహణకు త్వరలో టెండర్లు
- ఐసీఎఫ్‌కు టెండర్లు పిలిచే బాధ్యత అప్పగింత
- ఏం ఉత్పత్తి చేయాలన్నదానిపై త్వరలో నిర్ణయం
- ఉత్పత్తిపై ఢిల్లీలో త్వరలో రైల్వేశాఖ మంత్రి సమీక్ష

హైదరాబాద్: శరవేగంగా నిర్మాణమవుతున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ (రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్%-%ఆర్ఎంయూ) నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించాలని రైల్వేశాఖ యోచిస్తున్నట్లు తెలిసింది.

- మిగతా 2వ పేజీలో

## డీలిమిటేషన్‌పై బీజేపీని నమ్మలేం

- జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించింది దక్షిణాది రాష్ట్రాలే
- నియోజకవర్గాల పునర్విభజనలో ఆ రాష్ట్రాలకు తీవ్ర నష్టం
- మందబలం చూసుకుని బీజేపీ ఏమైనా చేస్తామంటే కుదరదు
- జైపూర్ టాక్ జర్నలిజం 9వ ఎడిషన్ చర్చలో బీఆర్ఎస్ నేత కేటీఆర్



హైదరాబాద్: ఉత్తర భారతదేశంలోని ఎంపీల సంఖ్యపై ఆధారపడి ఏర్పడే కేంద్ర ప్రభుత్వం.. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి ఒక్క రాష్ట్రం ఎంపీలే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదని తెలిపారు. జైపూర్‌లో జరుగుతున్న 'టాక్ జర్నలిజం'9వ ఎడిషన్ చర్చా కార్యక్రమంలో

- మిగతా 2వ పేజీలో

# వరంగల్ లో క్రికెట్ స్టేడియం...

- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యేలు
- వెంటనే విధివిధానాలు రూపొందించాలని అధికారులకు సీఎం ఆదేశాలు
- రేవంత్‌రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు
- యంగ్ స్పోర్ట్స్ స్కూల్ ప్రస్తావన తెచ్చిన శాసనసభ్యులు
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: వరంగల్‌లో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించి.. అందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు క్రీడాశాఖ కార్యదర్శితో ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం కడియం శ్రీహరి నేతృత్వంలో ఆదివారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసింది. ఈ బృందంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజులు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ చాలాసేపు మాట్లాడారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క స్టేడియం మాత్రమే ఉందని, జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో

2లో



## ఒకే యువతిని పెళ్లాడిన అన్నదమ్ములు!

- ప్రదీప్ నేగి ప్రభుత్వ ఉద్యోగి, విదేశాల్లో ఉద్యోగం చేస్తున్న తమ్ముడు కపిల్ నేగి
- హట్టి తెగలో కుటుంబాలు కలిసికట్టుగా ఉండేందుకే ఈ సంప్రదాయం
- హిమాచల్‌ప్రదేశ్‌లో దశాబ్దాలుగా పాటింపు

న్యూఢిల్లీ, జూలై 20: ఇద్దరు అన్నదమ్ములు ఒకే యువతిని వివాహమాడారు...! అవును ఇది నిజమే.. అదేమిటి వారేమైనా చదువు సంధ్యలు లేనివారనుకుంటున్నారా? కానే కాదు.. చదువుకుని ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా.. మరొకరు విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నారు.

2లో

## మద్యం అక్రమ కేసులో మిథున్‌రెడ్డికి రిమాండ్

- ఎంపీ మిథున్‌రెడ్డిని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు
- ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- ఎంపీగా కల్పించే సౌకర్యాలన్నింటినీ మిథున్‌కి కల్పించండి
- వెంట మందులు తీసుకెళ్లేందుకు అనుమతించండి
- విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశాలు
- కోర్టుకు నివేదించిన ఎంపీ మిథున్‌రెడ్డి

అమరావతి: మద్యం అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు ఆదివారం విజయవాడ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. కోర్టు ఆయనకు ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది.



2లో


## అంతిమ లబ్ధిదారు ఆయనే



- ప్రతి నెలా రూ.50-60 కోట్ల ముడుపులు
- ఐదేళ్లలో మొత్తం రూ.3,500 కోట్లపైనే
- ముడుపుల సొత్తులో రూ.200-300 కోట్లు ఎన్నికల్లో ఖర్చు
- ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ముడుపుల సొత్తు
- రాజ్ కెసిరెడ్డి నుంచి మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, గోవిందప్ప బాలాజీలకు
- ఆ ముగ్గురి నుంచి జగన్‌కు చేరవేత
- ప్రాథమిక అభియోగపత్రంలో వెల్లడి

2లో

2లో



## అసెంబ్లీలో మహారాష్ట్ర మంత్రి పేకాట

ముంబై: ఒక పక్క అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా, తనకేమీ సంబంధం లేనట్టు ఎన్సీపీ (అజిత్ వర్గం)కి చెందిన

## రాష్ట్ర పారిశ్రామిక ఎగుమతులు పైపైకి

- 2024-25లో రూ.1.35 లక్షల కోట్ల ఎగుమతులు జరిగినట్లు అంచనా
- 2023-24తో పోలిస్తే 23% వృద్ధి నమోదు
- ఫార్మా రంగానికి దీటుగా ఏరోస్పేస్, రక్షణ ఎగుమతులు
- పెరుగుతున్న ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం
- వచ్చే ఐదేళ్లలో 25 వేల సూక్ష్మ, చిన్న పరిశ్రమలు ఏర్పాటవుతాయని అంచనా



3లో

# అంతిమ లబ్ధిదారు ఆయనే

(మొదటి పేజీ తరువాయి)

వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారు నాటి సీఎం జగనేనని స్పష్టమైపోయింది. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి కొల్లగొట్టిన ముడుపుల సొమ్ము చివరిగా జగన్‌కే చేరిందని వెల్లడైంది. ప్రధాన నిందితుడు (ఏ-1) రాజ్ కెసిరెడ్డి ప్రతినెలా రూ.50-60 కోట్లు వసూలుచేసి ఆ మొత్తాన్ని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ-4), నాటి వైకాపా నేత విజయసాయిరెడ్డి (ఏ-5), భారతి సిమెంట్స్ డైరెక్టర్, జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలు చూసే గోవిందప్ప బాలాజీకి (ఏ-33) అందజేసేవారని, వారు ఆ సొత్తును ఎప్పటికప్పుడు జగన్‌కు చేర్చేవారని తేలింది. ఇలా రూ.3,500 కోట్ల మేర కొల్లగొట్టినట్లు వెలుగుచూసింది. దీన్నిబట్టి ఈ మొత్తం కుంభకోణమంతా జగన్ కోసం, ఆయనకు అత్యంత సన్నిహితులైన వ్యక్తుల ద్వారానే జరిగినట్లు తేటతెల్లమైపోయింది. ముడుపుల సొత్తులో కొంత మొత్తాన్ని గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు అందజేసి, ఓట్లు కొనుగోలు చేసినట్లు వెలుగుచూసింది. మద్యం స్కాం కేసులో సిట్ దాఖలుచేసిన 305 పేజీల ప్రాథమిక అభియోగపత్రం ఆదివారం వెలుగుచూసింది. అందులోని అంశాల్ని విశ్లేషిస్తే... ఈ వైకాపా మద్యం ముఠాను తెరవెనక నుంచి నడిపించిన 'బిగ్‌బాస్' జగనేనని స్పష్టమైపోయింది. పలుకుబడిని అడ్డం పెట్టుకుని బెదిరింపులకు పాల్పడి సొమకొల్లగొట్టేందుకు వీలుగా..

2019లో జగన్ అధికారంలోకి రాగానే ముడుపులు కొల్లగొట్టేందుకు వీలుగా నూతన మద్యం విధానం రూపకల్పన, అందుకోసం నిర్వహించిన సన్నాహక సమావేశాలు, ఈ కుట్ర అమలుకు అనుసరించిన విధానం, ముడుపులు చెల్లించిన బ్రాండ్లకు అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇవ్వడం, ముడుపులివ్వడానికి నిరాకరించిన కంపెనీలకు అసలు ఆర్డర్లే ఇవ్వకుండా మార్కెట్ నుంచి తరిమేయడం, ముడుపుల సొమ్ము వసూలు కోసం అనుసరించిన విధానం, ఆ సొమ్ము ఎవరెవరికి, ఎలా చేరింది? డొల్ల కంపెనీల ద్వారా దాన్ని ఎలా మళ్లించారు? గత సార్వత్రిక ఎన్నికల్లో ఎలా



ఖర్చుచేశారు? హవాలా ద్వారా దుబాయ్‌కి ఎలా తరలించారు? ఈ డబ్బుతో ఎంత విలాసవంతమైన జీవితాన్ని గడిపారు? విదేశాల్లో ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు? ముడుపుల సొమ్ము దాచిన డెన్‌లు ఎక్కడెక్కడున్నాయి? తదితర వివరాలన్నింటినీ ఈ అభియోగపత్రంలో సిట్ పేర్కొంది. సాక్షుల వాంగ్మూలాలు, డాక్యుమెంటరీ సాక్ష్యాలు, బ్యాంకు లావాదేవీల రికార్డులు, సీడీఆర్‌లు, ప్రయాణాలు, ఫోరెన్సిక్ నివేదికలన్నీ విశ్లేషించి ఈ కుంభకోణం గుట్టు రట్టుచేసింది. ప్రధానాంశాలివి.

నాటి ప్రభుత్వ పెద్దలకు, సన్నిహితులకు అందజేత

మద్యం ముడుపుల సొత్తు గత ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్న జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, అప్పటి సీఎంఓ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి, నాటి వైకాపా నేత విజయసాయిరెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ సహా అనేకమందికి అందేది. రాజ్ కెసిరెడ్డి, ఆయన అనుచరగణంతో వీరు నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నట్లు టెలికం రికార్డుల విశ్లేషణలో వెల్లడైంది. మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు రాజ్ కెసిరెడ్డి ముఠాలోని సభ్యులతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండేవారు. అనేక సందర్భాల్లో వారితో కలిసి ఒకేచోట ఉండేవారు. ఆ సందర్భాల్లోనే ముడుపులు తీసుకున్నారు. ముడుపుల ద్వారా కొల్లగొట్టిన సొత్తులో రూ.200-300 కోట్లను గత సార్వత్రిక ఎన్నికల్లో ఖర్చుల కోసం వైకాపా అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఆ పార్టీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డి ద్వారా ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోని అభ్యర్థులకు ఈ డబ్బు చేరవేశారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి తన పీఏలు, తనవద్ద పనిచేసే గన్‌మెన్‌ను ముడుపుల డబ్బు తెచ్చేందుకు హైదరాబాద్, తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని డెన్‌లకు పంపేవారు. ఈ సొత్తు రవాణా కోసం తుడా వాహనాలు వినియోగించారు. ఒక్కో విడతలో రూ.8-9 కోట్ల చొప్పున తెచ్చేవారు. ఈ డబ్బును చెవిరెడ్డి చెప్పినవారికి ఇచ్చేవారు. కావలి వైకాపా అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పీఏకూ ఈ సొమ్ము అందజేశారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ రూ.8.36 కోట్లు.. మద్యం ముడుపుల సొత్తే.

ముడుపుల సొత్తుతో కంపెనీల ఏర్పాటు

మద్యం ముడుపుల్లో కమీషన్ల ద్వారానే కాకుండా.. సొంతంగా కొన్ని మద్యం సరఫరా కంపెనీలను ఏర్పాటుచేసుకుని రాజ్ కెసిరెడ్డి (ఏ-1) దోచుకున్నారు. ఈ సొత్తుతో తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9)తో కలిసి అనేక స్టార్టప్ కంపెనీలు ఏర్పాటుచేశారు. అప్పటికే ఉన్న కొన్ని కంపెనీలను కొనేశారు. ప్రధానంగా ఈవీలు, ఫార్మా, లాజిస్టిక్స్, ఇతర వర్ధమాన రంగాల్లో కంపెనీలు పెట్టారు. వాటికి పరిశోధన వ్యయం, నిర్వహణ ఖర్చులు, ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులన్నింటికీ మద్యం ముడుపుల సొత్తే వాడారు. రాజ్ కెసిరెడ్డి ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరిట సినీ నిర్మాణ కంపెనీ ఏర్పాటుచేసి, స్పై అనే సినిమా తీశారు. దీనిద్వారా నల్లధనాన్ని వైట్‌లోకి మార్చుకున్నారు. ఆ డబ్బుతో హైదరాబాద్ శివార్లలో భారీగా భూములు కొన్నారు. రాజ్ కెసిరెడ్డి, ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు మద్యం ముడుపుల సొత్తుతో అత్యంత ఖరీదైన కార్లు కొనుగోలు చేశారు.

## కాజీపేట' నిర్వహణ ప్రైవేటుకు?

ఈ యూనిట్ నిర్వహణ, ఉత్పత్తిని చూసుకునే సంస్థను ఎంపికచేసే బాధ్యతను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)కి రైల్వే బోర్డు అప్పగించింది. సంస్థ ఎంపికకు త్వరలో టెండర్లు ఆహ్వానించాలని ఆదేశిస్తూ తాజాగా ఐసీఎఫ్‌కు లేఖ రాసింది. ప్రస్తుతం కాజీపేట ఫ్యాక్టరీలో జరుగుతున్న సివిల్ పనులు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తవుతాయి. 2026 చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ప్రస్తుతం నిర్మాణ పనులను రైల్వే అనుబంధ సంస్థ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) పర్యవేక్షిస్తోంది. క్షేత్రస్థాయిలో నిర్మాణ బాధ్యతను పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్%-%టైకిషా జాయింట్ వెంచర్‌కు ఆర్‌వీఎన్‌ఎల్ అప్పగించింది. రైల్ కోచ్‌ల తయారీకి అవసరమైన అన్ని షెడ్లు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ పనులను శనివారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పరిశీలించిన విషయం తెలిసిందే.

**వైదొలగనున్న ఆర్‌వీఎన్‌ఎల్..**

కర్ణాటకలోని యాద్గిర్‌లో ఉన్న రైలు బోగీల తయారీ కర్మాగారం నిర్వహణ, ఉత్పత్తి బాధ్యతను ఆర్‌వీఎన్‌ఎల్ ప్రస్తుతం నేరుగా పర్యవేక్షిస్తోంది. కాజీపేట ఫ్యాక్టరీలో ఉత్పత్తి బాధ్యతను కూడా ఆ సంస్థకే అప్పగిస్తారని భావించారు. కానీ, దానిని ప్రైవేటు సంస్థకు అప్పగించాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. టెండర్లు పిలిచి ప్రైవేటు సంస్థకు కాజీపేట ఫ్యాక్టరీని అప్పగించే బాధ్యతను ఐసీఎఫ్‌కు అప్పగించింది.

**ఉత్పత్తిపై త్వరలో నిర్ణయం**

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఏదో ఒక నిర్ధారిత కాంపోనెంట్ ఉత్పత్తికి పరిమితం చేయకుండా, డిమాండ్ ఉన్న అన్ని రకాల కాంపోనెంట్ల ఉత్పత్తికి అనువుగా నిర్మిస్తున్నారు. ఇందుకు గాను ప్రధాన షెడ్‌లో నాలుగు బేస్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ వందేభారత్ రైళ్లు, సాధారణ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, ఎలక్ట్రిక్ మల్టీ పుల్ యూనిట్ (ఈఎంయూ లోకోమోటివ్)లను తయారు చేసేలా నిర్మిస్తున్నారు. అవసరమైతే సరుకు రవాణా వ్యాగన్లను కూడా తయారు చేస్తారు. వీటిల్లో మొదట వేటిని తయారు చేయాలో ఇంకా నిర్ణయించలేదు. శనివారం రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఫ్యాక్టరీని సందర్శించిన సమయంలో రైల్వే బోర్డు అధికారులతో సమీక్షించి నిర్ణయించాల్సి ఉంది. కానీ, సమయాభావం వల్ల ఆయన పర్యటన పావుగంటకే పరిమితమైంది. త్వరలో ఢిల్లీలో సమీక్షించి ఉత్పత్తిపై నిర్ణయం తీసుకోనున్నారు. నిర్ణయించిన కోచ్‌ల తయారీకి వీలుగా ఐసీఎఫ్ టెండర్లు పిలుస్తుంది.

## ఒకే యువతిని పెళ్లాడిన అన్నదమ్ములు!

మరి ఎందుకిలా..? హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఓ తెగ సంప్రదాయం ఇది. ఆ రాష్ట్రంలోని సిర్మార్ జిల్లా షిలాయి గ్రామంలో ఈ వివాహం జరిగింది. ఇక్కడ హట్టి తెగకు చెందిన ప్రదీప్ నేగి, కపిల్ నేగి అనే ఇద్దరు అన్నదమ్ములు కున్హత్ గ్రామానికి చెందిన సునీత చౌహాన్ అనే యువతిని తమ తెగ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన వీరి వివాహ కార్యక్రమానికి వందలాది మంది హాజరయ్యారు. ప్రదీప్ హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వ శాఖలో పనిచేస్తుండగా, అతడి తమ్ముడు కపిల్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ వివాహం తమ ఇష్టపూర్వకంగానే చేసుకున్నామని ముగ్గురూ చెప్పడం విశేషం. వీరి వివాహానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా ప్రాచుర్యంలోకి వచ్చి చర్చకు దారితీసింది. ఇలా ఒకరు ఇద్దరిని వివాహం చేసుకోవడం భారత్‌లో చట్టవిరుద్ధం అయినా హిమాచల్‌ప్రదేశ్‌లో సిర్మార్ జిల్లాలోని పలు గ్రామాల్లో ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. అలాగే కిన్నూర్, లాహోల్ స్పితి జిల్లాల్లో, పొరుగున ఉన్న ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొన్నిచోట్ల ఈ విధానం ఉంది. హట్టి తెగకు చెందినవారు ఇది తమ సంప్రదాయమని చెబుతున్నారు. జోడిదారణ్ లేదా ద్రౌపది ప్రథగా ఈ సంప్రదాయాన్ని వారు పిలుస్తారు. ఇటీవలే ఈ తెగవారికి గిరిజన తెగ(ఎస్టీ) హోదా కూడా వచ్చింది. కాగా, సెంట్రల్ హట్టి కమిటీ న్యాయ సలహాదారు అయినరణ్‌సింగ్ చౌహాన్ అనే న్యాయవాది మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఈ సంప్రదాయం హిమాచల్‌ప్రదేశ్‌లో కొనసాగుతోందని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు కూడా దీన్ని గుర్తించిందన్నారు.

## అసెంబ్లీలో మహారాష్ట్ర మంత్రి పేకాట


మహారాష్ట్ర వ్యవసాయ మంత్రి మాణిక్‌రావు అసెంబ్లీ హాల్‌లో తన ఫోన్‌లో పేకాట ఆడుకుంటున్న దృశ్యం తీవ్ర విమర్శలకు దారితీసింది. మహారాష్ట్రలో అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్సీపీ (అజిత్ పవార్) కూటమిపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేచశారు.

## బీజేపీ హైకమాండ్ చెబితే ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తా: రాజాసింగ్

**పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న రాజాసింగ్**

**ఇటీవలే బీజేపీకి రాజీనామా**

**ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వైనం**



కొంతకాలంగా పార్టీ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవలే బీజేపీకి రాజీనామా చేయడం తెలిసిందే. తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ హైకమాండ్ చెబితే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని అన్నారు. బీజేపీ పెద్దల నిర్ణయాన్ని పాటిస్తానని తెలిపారు. ఇవాళ బోనాల సందర్భంగా నగరంలోని సింహవాహిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న రాజాసింగ్, అనంతరం మీడియాతో మాట్లాడారు. గోషామహల్ అంటే బీజేపీ అడ్డా అని, ఇక్కడ ఉప ఎన్నిక వచ్చినా తనకేమీ అభ్యంతరం లేదని చెప్పారు. ఎవరు పోటీ చేసినా తానేమీ బాధపడనని స్పష్టం చేశారు. అంతేగాకుండా, తాను ఏ పార్టీలోకి వెళ్లనని అన్నారు.

# వరంగల్ లో క్రికెట్ స్టేడియం...

(మొదటి పేజీ తరువాయి)

వివిధ క్రీడల నిర్వహణకు ఉపయోగపడుతోందని, శిక్షణ కోసం కూడా ఉపయోగిస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు సీఎంకు వివరించారు. వరంగల్ అన్ని వైపులా విస్తరిస్తున్న నేపథ్యంలో జనాభా పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా క్రీడా సేవల విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం అవసరాలను తీర్చలేకపోతోందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ క్రీడా పాఠశాలను మంజూరు చేయడం ద్వారా ప్రత్యేక క్రీడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించొచ్చని, ఈ పాఠశాలు ఏర్పాటుకు అవసరమైన 20 ఎకరాల ప్రభుత్వ భూమి ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో అందుబాటులో ఉందన్నారు. వరంగల్‌కు చెందిన విద్యార్థులు క్రికెట్ ఆడటానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో క్రికెట్ కోసం ప్రత్యేక స్టేడియం ఏర్పాటు చేయాలని కూడా కోరారు. క్రీడా పాఠశాలతోపాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియాన్ని వీలున్నంత త్వరగా మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా పాఠశాలతో పాటు ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటుతో పాటు జిల్లా అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు.

**ఆసక్తికర భేటీ**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, మంత్రి కొండా సురేఖ దంపతులకు విభేదాలు వచ్చిన నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా భేటీ కావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల సీఎం రేవంత్ మంత్రి సురేఖ, ఆమె కుమార్తె సుస్మితా పటేల్‌తో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఇప్పుడు ఆమెను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలతో భేటీ కావడంతో ఈ సమావేశంలో రాజకీయంగా ఏం చర్చ జరిగిందన్నది ఆసక్తి నెలకొంది. ఇరుపక్షాలకు సర్దిచెప్పేందుకే రేవంత్ విడివిడిగా ఉమ్మడి వరంగల్ నేతలతో సమావేశమయ్యారని, వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలను కొంతకాలం పక్కనపెట్టేలా ఈ భేటీలో చర్చలు జరిగాయని తెలుస్తోంది.

## డీలిమిటేషన్‌పై బీజేపీని నమ్మలేం

కేటీఆర్ ఆదివారం మాట్లాడారు. జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజనలో తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. డీలిమిటేషన్‌లో దక్షిణాదికి అన్యాయం జరగనివ్వబోమని బీజేపీ ప్రభుత్వం చెబుతున్న మాటలను నమ్మలేమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే స్థానాలు పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పెంచలేదని గుర్తుచేశారు. అడగకముందే వారి రాజకీయ ప్రయోజనాల కోసం జమ్మూకశ్మీర్, అస్సాంలో మాత్రం అసెంబ్లీ సీట్లను పెంచారని మండిపడ్డారు. మంద బలం, అధికారం ఉందన్న అహంకారంతో జాతీయ భాషగా హిందీని బలవంతంగా రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విషయంలో తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయని తెలిపారు. 'దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. తనకు ఇష్టం వచ్చిన పనులు చేస్తానని బీజేపీ అనుకుంటే.. ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఆ పార్టీ నే బాధ్యత వహించాల్సి ఉంటుంది'అని స్పష్టంచేశారు.

**బిహార్ ఓటర్ సర్వేపై అనుమానాలు**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో అర్హత కలిగిన ఏ ఒక్క వ్యక్తి కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదని కేటీఆర్ అన్నారు. బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల సవరణ మొదటిసారి కానప్పటికీ దానిపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయని, కేంద్ర ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. బిహార్ పరిణామాలపై తమకు చాలా అభ్యంతరాలు ఉన్నాయని, దేశంలోని మిగతా రాష్ట్రాలపై దీని ప్రభావం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజల మధ్య విభేదాలు, విద్వేషాలు సృష్టించడం చాలా సులభమని అన్నారు. బిహార్ పరిణామాలు ప్రజలను విడగొట్టే రాజకీయ కుట్రలో భాగమేనని అనుమానం వ్యక్తంచేశారు. ఎన్నికల తరువాత ఫలితాలపై మాట్లాడటం కంటే ముందే ఇలాంటి విషయాల మీద దృష్టి పెట్టాలని సూచించారు. బిహార్‌లో 5 లక్షల మంది ఓట్లు గల్లంతు కావటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. గత ఎన్నికల్లో కేవలం 12,500 ఓట్ల తేడాతో అక్కడ ఆర్జేడీ అధికారాన్ని కోల్పోయిందని గుర్తుచేశారు. ముందు దేశం.. ఆ తర్వాతే ప్రాంతం, మతం, కులం అని స్పష్టంచేశారు.

## మద్యం అక్రమ కేసులో మిథున్‌రెడ్డికి రిమాండ్

మిథున్‌రెడ్డిని రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని ఆదేశించింది. ఓ పార్లమెంట్ సభ్యుడికి నిబంధనల ప్రకారం జైలులో ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తారో వాటన్నింటినీ మిథున్‌రెడ్డికి కల్పించాలని జైలు అధికారులను ఆదేశించింది. వెంట మందులు తీసుకెళ్లేందుకు మిథున్‌రెడ్డికి అనుమతినిచ్చింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం అక్రమ కేసులో నాలుగో నిందితునిగా ఉన్న మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు సుదీర్ఘ విచారణ తరువాత శనివారం రాత్రి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆదివారం కోర్టు ఎదుట హాజరుపరిచే ముందు మిథున్‌రెడ్డిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయనకు ఈసీజీ, బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయనను ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచారు.

రాజకీయ కక్ష సాధింపుతో నాపై కేసు పెట్టారు

ఈ సందర్భంగా మిథున్‌రెడ్డితో న్యాయాధికారి మాట్లాుడారు. ఊరు, పేరు, తల్లిదండ్రుల పేర్లు, కుటుంబంలో ఎంత మంది ఉంటారు.. వంటి వివరాలు అడిగారు. వాటన్నింటికీ మిథున్‌రెడ్డి సమాధానం చెప్పాురు. తనపై దురుద్దేశాలతో, రాజకీయ కారణాులతో ఈ కేసు నమోదు చేశారని మిథున్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. తానెలాంటి తప్పు గానీ, నేరం గానీ చేయలేదన్నారు. కోర్టు ముందు హాజరుపరిచే ముుందు వైద్యులు తనకు రెండుసార్లు ఈసీజీ పరీక్షలు నిర్వహించారని, రెండింటికీ తేడాలు ఉన్నాయని తెలిపారు. అందుువల్ల తనకు పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన కోర్టుకు నివేదించారు.

ప్రత్యేక సౌకర్యాలు కల్పించండి..

ఆ తర్వాత మిథున్‌రెడ్డి తరఫు న్యాయవాది తప్పెట నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. మిథున్‌రెడ్డి మూడు పర్యాయాల నుంచి ఎంపీగా ఉన్నారని తెలిపారు. ఆయన లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా కూడా వ్యవహరించారని వివరించారు. ఆయనకున్న ప్రాణహాని దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆయనకు వై కేటగిరి భద్రత కల్పించిందని నాగార్జునరెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలో జైలులో ఆయనకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే వెంట మందులు తీసుకెళ్లేందుకు అనుమతినివ్వాలని కోరారు. పిటిషనర్‌కు రిమాండ్ విధిస్తే తగిన సౌకర్యాలు ఉన్న నెల్లూరు కేంద్ర కారాగారానికి గానీ, రాజమండ్రి కేంద్ర కారాగారానికి గానీ పంపాలని కోరారు. జైలులో వీఐపీ బ్యారెక్ కేటాయించాలని అభ్యర్థించారు.





# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన దుల్కర్ సల్మాన్

**జూబ్లీహిల్స్ లోని రేవంత్ నివాసంలో మర్యాదపూర్వక భేటీ**

**దుల్కర్ వెంట నిర్మాతలు స్వప్న దత్, చెరుకూరి సుధాకర్**

**దుల్కర్ కు శాలువా కప్పిన రేవంత్ రెడ్డి**

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, నిర్మాతలు స్వప్న దత్, చెరుకూరి సుధాకర్ ఆదివారం (జులై 20) నాడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దుల్కర్ సల్మాన్‌ను శాలువా కప్పి సత్కరించారు. అనంతరం కాసేపు ముచ్చటించుకున్నారు. దుల్కర్ సల్మాన్ తెలుగు చిత్ర పరిశ్రమలో 'మహానటి', 'సీతారామం', 'లక్కీ భాస్కర్' వంటి స్ట్రయిట్ చిత్రాలతో గుర్తింపు పొందారు. ఇందులో మహానటి, సీతారామం స్వప్న దత్ నిర్మాతగా వైజయంతీ మూవీస్ బ్యానర్ పైనే వచ్చాయి. ప్రస్తుతం దుల్కర్ 'కాంత', ఆకాశంలో ఒక తార అనే చిత్రాల్లో నటిస్తున్నారు. కాంత చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా సంస్థ నిర్మిస్తోంది.





# పెరిగిన భూగర్భ జలాలు

## గత జూన్‌లో భూగర్భ జలమట్టాల్లో స్వల్ప వృద్ధి

హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభం కావడంతో రాష్ట్రంలో భూగర్భ జలమట్టాల్లో వృద్ధి ప్రారంభమైంది. జూన్‌లో రాష్ట్ర భూగర్భ జలాల సగటు మట్టం 9.47 మీటర్లకు చేరింది. వేసవిలో సాగు, తాగు, ఇతర అవసరాలకు బోరుబావుల నుంచి విచ్చలవిడిగా నీళ్లను తోడుకోవడంతో గత ఏప్రిల్ చివరి నాటికి భూగర్భ జలాల సగటు మట్టం 10.17 మీటర్ల లోతుకి దిగజారిపోయింది. ముందస్తుగా రుతుపవనాల రాకతో ఆ తర్వాతి మేలో కురిసిన వర్షాలతో భూగర్భ జలమట్టాల సగటు లోతు 10.07 మీటర్లకు తగ్గింది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత జూన్‌లో కురిసిన వర్షాలతో భూగర్భ జలాల సగటు లోతు 9.47 మీటర్లకు ఎగబాకింది. మేతో పోల్చితే జూన్‌లో భూగర్భ జలమట్టాల సగటు 0.6 మీటర్ల మేర వృద్ధి చెందినట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి ఈ మేరకు నివేదిక రూపొందించింది. అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షిస్తుంది.

**12 జిల్లాల్లో ఆందోళనకరం**

రాష్ట్రంలో భూగర్భ జలాలు అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 5.14 మీటర్ల లోతులోనే ఉండగా, అత్యధికంగా వికారాబాద్ జిల్లాలో 14.74 మీటర్ల లోతులో ఉన్నాయి. జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0%-%5 మీటర్లు, 5%-%10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. భూగర్భ జలాలు 0%-%5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. అయితే, రాష్ట్రంలో ఒక్క జిల్లాలో కూడా ఈ పరిస్థితి లేదని గుర్తించారు. 21 జిల్లాల్లో 5%-%10 మీటర్ల లోతులో, 12 జిల్లాల్లో 10%-%15 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది. 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోతే పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు. 12 జిల్లాల్లో ఇలాంటి పరిస్థితులున్నాయి.

**20 శాతం తక్కువ వర్షపాతం**

జూన్‌లో రాష్ట్రవార్షిక సగటు వర్షపాతం 130 మి.మీ. కాగా, 2025%-%26 జూన్‌లో 104 మి.మీ. నమోదైంది. అంటే సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షం కురిసింది. 2024 జూన్‌తో పోలిస్తే 2025 జూన్‌లో 22 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో వృద్ధి నమోదు కాగా, మరో 11 జిల్లాల్లో క్షీణత కనిపించింది. గత ఏడాది జూన్‌లో సగటు భూగర్భ జలాల లోతు 9.9 మీటర్లుకాగా.. ఈ ఏడాది జూన్‌లో 9.47 మీటర్లుగా నమోదైంది.

# ఈ 12 జిల్లాల్లో అతిభారీ వానలు..

**ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ**



తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారడంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతిభారీ వానలు పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ విభాగం. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ వివరించింది.

# రాష్ట్ర పారిశ్రామిక ఎగుమతులు పైపైకి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: కరోనా మహమ్మారి, వేతనాల పెరుగుదల, ఉత్పత్తి వ్యయం పెరగడం, అమెరికా చైనా వాణిజ్య యుద్ధం తదితరాల నేపథ్యంలో పలు దేశాలు, కంపెనీలు 'చైనా ప్లస్ వన్'వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. భారత్, థాయ్‌లాండ్, వియత్నాం, ఇండోనేసియా వంటి దేశాలు ఎక్కువగా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు వీలుగా ఆ దేశం వెలుపల వ్యాపార విస్తరణకు, పారిశ్రామిక రంగ అభివృద్ధికి మొగ్గు చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సైతం ఇదే వ్యూహంతో ముందుకు వెళుతోంది. రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈలు) శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో తెలంగాణ పారిశ్రామిక ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తోంది. పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలకు చిరునామాగా ఉన్న జిల్లాలు పారిశ్రామిక ఎగుమతుల్లో కీలకంగా నిలుస్తున్నాయి. అంతరిక్షం, రక్షణ, ఔషధాలు, కర్బన రసాయనాలు, ఎలక్ట్రిక్ పరికరాలు తదితర రంగాల ఎగుమతుల్లో ఎంఎస్‌ఎంఈలు గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయి.

**ఏరో స్పేస్ వేగం..**

2023%-%24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర పారిశ్రామిక ఎగుమతులు రూ.1.16 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022%-%23 (రూ.91,776 కోట్లు)తో పోలిస్తే 23 శాతం వృద్ధి నమోదైంది. గత (2024%-%25) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి గణాంకాలు అందుబాటులోకి రానప్పటికీ డిసెంబర్ నాటికి ఏరోస్పేస్ రంగం ఎగుమతుల్లో భారీ వృద్ధి కనిపిస్తోంది. 2023%-%24లో ఈ రంగంలో ఎగుమతులు రూ.15,907 కోట్లు కాగా గత ఏడాది డిసెంబర్ నాటికి రూ.30,742 కోట్లకు చేరినట్లు అంచనా. 2024%-%25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగ ఎగుమతులు రూ.41 వేల కోట్లకు చేరినట్లు లెక్కలు వేస్తున్నారు. మొత్తం మీద గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి తెలంగాణ పారిశ్రామిక ఎగుమతులు రూ.1.35 లక్షల కోట్లకు చేరినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.



కాగా ఏరోస్పేస్ రంగంలో అంతర్జాతీయ పెట్టుబడులు రాష్ట్రానికి వస్తుండటంతో ఈ రంగం వేగంగా పురోగమిస్తున్నట్లు పరిశ్రమల శాఖ అధికారులు చెప్తున్నారు. తెలంగాణ పారిశ్రామిక ఎగుమతుల్లో ఫార్మా రంగం ఆధిపత్యం కొనసాగుతోంది. పారిశ్రామిక ఎగుమతుల్లో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు రాష్ట్రానికి వెన్నెముకగా నిలుస్తుండగా..ఫార్మా ఎగుమతుల్లో ఈ క్లస్టర్లు అధికంగా ఉండే సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు అగ్రస్థానంలో ఉన్నాయి.

2023%-%24 నివేదికల ప్రకారం రాష్ట్ర పారిశ్రామిక ఎగుమతుల్లో ఈ నాలుగు జిల్లాల వాటాయే 87 శాతం మేర ఉంది. 2024%-%25 ప్రాథమిక నివేదిక ప్రకారం కేవలం రంగారెడ్డి జిల్లా నుంచే 40 శాతం ఎగుమతులు జరుగుతున్నాయి. రాష్ట్ర రాజధానికి పొరుగునే ఉండటం, పారిశ్రామిక పార్కులు, ఇతర మౌలిక వసతులు కేంద్రీకృతమై ఉండటం రంగారెడ్డి జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతోంది.

ప్రస్తుతం అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, చైనా నుంచి ఎక్కువ మొత్తంలో పారిశ్రామిక దిగుమతులు జరుగుతుండగా, తెలంగాణ నుంచి సుమారు వంద దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. పారిశ్రామిక ఎగుమతుల్లో కీలకమైన ఎంఎస్‌ఎంఈలు ఓ వైపు అంతర్జాతీయ మార్కెట్ సప్లై చైన్‌లో కీలకంగా మారుతుండగా, మరోవైపు స్థానికంగా ఉపాధిలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది తెలంగాణ ఎంఎస్‌ఎంఈ పాలసీ ప్రకటించిన నేపథ్యంలో.. వచ్చే ఐదేళ్లలో పారిశ్రామిక ప్రగతి, ఎగుమతులు రెట్టింపు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పాలసీలో భాగంగా ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు అవసరమైన భూమి, నిధులు, ముడి సరుకు, మార్కెట్‌తో అనుసంధానం, అన్ని పారిశ్రామిక పార్కుల్లో ఎంఎస్‌ఎంఈలకు 20 శాతం ప్లాట్ల కేటాయింపు వంటి ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 25 వేల ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటవుతాయని అంచనా వేస్తున్నారు.

# బోనమెత్తిన భాగ్యనగరం



- వాడవాడలా బోనాలతో ఊరేగింపులు..
- అమ్మవారికి చీరెసారె సమర్పణ..
- లాల్‌దర్వాజకు పోటెత్తిన భక్తులు
- సింహవాహినికి ప్రముఖుల పూజలు

ఆషాఢమాసం చివరి ఆదివారం రోజు భాగ్యనగరి బోనమెత్తింది.. వాడవాడలా మహిళలు కొనసాగించిన ఆచారాలతో హైదరాబాద్ కోలాహలంగా మారింది.. బోనాలతో ఊరేగింపుగా సంప్రదాయబద్ధంగా తరలివచ్చిన భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది..ఎటుచూసినా వేపాకు తోరణాలు, డప్పుచప్పుళ్లు, అమ్మవార్ల పాటలు, భజనలతో రాజధాని నగరం హోరెత్తింది.. గల్లీ నుంచి గోల్కొండ దాకా.. బస్తీల నుంచి లాల్‌దర్వాజ దాకా.. అడుగడుగునా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. పోతరాజుల విన్యాసాలు, తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపులు, విద్యుద్దీపాల అలంకరణలో ఆహ్లాదకర పోటీ కనిపించింది.

నగరంలోని ప్రధానమైన 29 దేవాలయాల వద్ద బోనాల ఉత్సవాలు ఆడంబరంగా జరిగాయి. ఇవే కాకుండా వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 360 ఆలయాల వద్ద ప్రజలు బోనాల జాతర వైభవంగా జరుపుకొన్నారు. తొట్టెలు, ఫలహారం బండ్ల ఊరేగింపులతో ఎటు చూసినా సందడే కనిపించింది. కొన్నిచోట్ల ఫలహారం బండ్లు సోమవారం తీస్తుండడంతో వాటిని అలంకరించడానికి ముందు నుంచే సిద్ధం చేస్తున్నారు. ఆదివారం లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారితో పాటు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి, హరిబౌలి శ్రీ అక్కన్నమాదన్న, మేకలబండ శ్రీ నల్లపోచమ్మ, ఉప్పుగూడ శ్రీ మహంకాళి, బేలా ముత్యాలమ్మ, సుల్తాన్‌షాహి శ్రీజగదాంబ, మీరాలమండి శ్రీ మహాకాళేశ్వరీ, బేలా బంగారు మైసమ్మ, అలియాబాద్ దర్బార్ మైసమ్మ అమ్మవార్లను వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు.

**లాల్‌దర్వాజలో బోనాల సందడి..**

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలను భక్తులు సాంప్రదాయ పద్ధతిలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జంటనగరాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. డిప్యూటీ సీఎ బట్టి విక్రమార్క అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున నాలుగు గంటలకు బలిహరణ, అనంతరం మాజీ ఎంపీ దేవేందర్‌గౌడ్ కుటుంబసభ్యుల చేతులమీదుగా మహాభిషేకం జరిగింది. తర్వాత బోనాల సమర్పణ కార్యక్రమం మొదలైంది.బోనాల సందర్భంగా మహిళలు కొత్త మట్టి కుండకు పసుపు, కుంకుమ, వేప ఆకులతో అందంగా అలంకరణ చేసి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యం కుండలో పెట్టి కుండ పైన వెలిగించిన దీపంతో సాంప్రదాయ దుస్తులతో దేవాలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద బోనం సమర్పించే వారి

# హిందువులు నిధుల కోసం యాచించాల్సిన దుస్థితి ఎందుకు?: బండి సంజయ్

**తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే పండుగలకు ప్రత్యేక నిధులు**

**హిందువులు గర్వించేలా ఉత్సవాలు నిర్వహిస్తామన్న బండి సంజయ్**

**హిందూ ఉత్సవాలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తామని వెల్లడి**



హిందువులు పన్నులు, విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లిస్తూ, ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని అందిస్తున్నప్పటికీ, ఆలయాలు మరియు బోనాలు వంటి పండుగల కోసం నిధుల కోసం ప్రతి సంవత్సరం యాచించాల్సిన దుస్థితి ఎందుకని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే, హిందూ పండుగలు మరియు ఆలయాల కోసం ప్రత్యేక నిధులను కేటాయించి, హిందువులు గర్వించేలా ఉత్సవాలు నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. హిందూ ఉత్సవాలకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఓల్డ్ సిటీలో భాగ్యలక్ష్మి ఆలయం వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, బండి సంజయ్, గతంలో భయోత్పాతం మరియు జిహాదీ గ్యాంగ్‌ల కారణంగా ఓల్డ్ సిటీ నుంచి వలస వెళ్లిన హిందువులు ఇప్పుడు భయం లేకుండా తిరిగి రావాలని పిలుపునిచ్చారు. "ఓల్డ్ సిటీ అందరిదీ, అందరికీ రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత" అని ఆయన అన్నారు. భాగ్యలక్ష్మి ఆలయం హిందూ పునరుజ్జీవనానికి చిహ్నంగా నిలిచిందని, ఇప్పుడు ఆ ప్రాంతంలో సానుకూల మార్పు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.



## బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే గరిష్ఠ ధర రూ.49 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 19: దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి బీఎండబ్ల్యూ తీసుకొచ్చింది. చెన్నై ప్లాంట్లో తయారైన బీఎండబ్ల్యూ 2 సిరీస్ గ్రాన్ కూపే దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద ముందస్తు బుకింగ్ చేసుకోవాల్సి వుంటుందని సూచించింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు ధర రూ.46.90 లక్షల నుంచి రూ.48.90 లక్షల లోపు లభించనున్నది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ కారుపై మూడేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వరకు మెయింటెనెన్స్ వర్క్ ప్యాకేజీని అందిస్తున్నది.

## ఒకే మోడల్.. నాలుగేళ్లలో 6 లక్షల యూనిట్లు తయారీ



టాటా మోటార్స్ తన పాపులర్ మైక్రో ఎస్‌యూవీ టాటా పంచ్ కార్లును ఇప్పటివరకు 6,00,000 తయారు చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ కారు తయారీ ప్రారంభించిన నాలుగు ఏళ్లలో ఈమేరకు గణనీయమైన ఉత్పత్తి మైలురాయిని చేరుకున్నట్లు పేర్కొంది. ఇండియాలోని కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో ఈ మోడల్ గేమ్ ఛేంజర్‌గా నిలిచినట్లు చెప్పింది. 'అక్టోబర్ 2021లో లాంచ్ అయిన టాటా పంచ్ దాని డిజైన్, హై గ్రౌండ్ క్లియరెన్స్, ఇతర ఫీచర్లతో త్వరగా వినియోగదారుల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంది. టాటా ఆల్ఫా (ఎజిల్ లైట్ ఫ్లెక్సిబుల్ అడ్వాన్స్డ్) ఆర్కిటెక్చర్‌తో నిర్మించిన పంచ్ ఓ మోస్తారు ఎస్‌యూవీ వాహనాలు చూస్తున్న వారిని ఎంతో ఆకర్షించింది' అని కంపెనీ తెలిపింది. 2024 క్యాలెండర్ ఇయర్‌లో ఇండియాలో బెస్ట్ సెల్లింగ్ కారుగా టాటా పంచ్ నిలిచిందని సంస్థ పేర్కొంది. అమ్మకాల పరంగా మారుతీ సుజుకీ దశాబ్దాల ఆధిపత్యాన్ని అధిగమించినట్లు తెలిపింది. గత 40 ఏళ్లలో వార్షిక అమ్మకాల్లో మారుతీని తొలిసారి టాటా వెనక్కి నెట్టినట్లు చెప్పింది. ఇది ఐసీఈ, ఈవీ వెర్షన్‌ల్లో లభ్యం అవుతుంది.

## ఎలక్ట్రిక్ కార్ల జోరు.. రానున్న రోజులు ఈవీలవే..



కొత్త మోడల్స్ ఎంట్రీతో పాటు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్ఈఈ) సరఫరా సమస్యలు సకాలంలో పరిష్కారమైతే, దేశీయంగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు మరింతగా పెరుగుతాయని కేర్‌ఎడ్జ్ అడ్వైజరీ ఒక నివేదికలో తెలిపింది. 2028 నాటికి దేశీయంగా మొత్తం కార్ల విక్రయాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7 శాతానికి చేరొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పెరగడమనేది, చార్జింగ్ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలపై కూడా ఆధారపడి ఉంటుందని కేర్‌ఎడ్జ్ అడ్వైజరీ అండ్ రీసెర్చ్ సీనియర్ డైరెక్టర్ తన్వి షా తెలిపారు. ఈవీల వినియోగం పెరగడానికి ప్రధాన అవరోధంగా ఉంటున్న చార్జింగ్ మౌలిక సదుపాయాలు ఇటీవలి కాలంలో గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు.దేశీయంగా 2022 క్యాలెండర్ ఇయర్‌లో 5,151గా ఉన్న పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలో 26,000కు చేరినట్లు నివేదిక తెలిపింది. మరోవైపు, 2021 ఆర్థిక సంవత్సరంలో సుమారు 5,000 యూనిట్ల స్థాయిలో నమోదైన ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 1.07 లక్షల యూనిట్లకు చేరాయి.

# టీసీఎస్‌లో భయం.. భయం..

### కొత్త పాలసీతో ఎంప్లాయీస్‌లో గుబులు
### ముగిసిన 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్
### లేఆఫ్‌లు, డిమోషన్లపై పెరుగుతున్న ఆందోళన
### కేంద్రం జోక్యానికి ఉద్యోగ సంఘాల లేఖ

**ఆడుతూ పాడుతూ పని, ఆకర్షణీయ వేతనాలు, విలాసవంతమైన జీవితం. ఇదీ.. ఐటీ రంగంలో కొలువుల తీరు. అయితే నిన్నమొన్నటిదాకా ఇలా ఉండచ్చేమోగానీ.. ఇప్పుడు మాత్రం సీన్ రివర్సైంది. కొరవడిన ఉద్యోగ భద్రత, జీతాల్లో కోతలు, ఒత్తిడితో కూడిన జీవనం. ఇదీ.. ఐటీ రంగ ఉద్యోగుల ప్రస్తుత పరిస్థితి. సాంకేతిక మార్పులు, పెరుగుతున్న పోటీ, పడిపోతున్న ఆదాయం ఇలా.. ఎన్నెన్నో అంశాలు ఐటీ కంపెనీలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే టీసీఎస్ ఓ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పుడిది అటు ఉద్యోగుల్లో, ఇటు పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది.**



దేశీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తెచ్చిన కొత్త పాలసీ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. గత నెల జూన్ 12న అమల్లోకి వచ్చిన ఈ విధానంలో 35 రోజుల బెంచ్ పాలసీ డెడ్‌లైన్ తాజాగా ముగిసింది. దీంతో సంస్థ ఉద్యోగులకు గుబులు పట్టుకుంటున్నది. వేలాది ఉద్యోగులు తమ భవిష్యత్తుపై అనిశ్చితిని చూడాల్సి వస్తున్నది మరి. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అన్ని విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ఈ పాలసీ వర్తిస్తుండటం గమనార్హం.

**ఏమిటీ కొత్త పాలసీ?**

ఏ ప్రాజెక్టులో భాగస్వామి కాకుండా ఏడాదిలో గరిష్ఠంగా 35 రోజుల కంటే ఎక్కువ రోజులు సంస్థలో పనిచేసే ఏ ఉద్యోగీ ఉండరాదు. అలా ఉన్నట్టైతే వారి ఉద్యోగం రిస్క్‌లో పడ్డట్టే. ఫ్రెషర్లైతే ఉద్యోగాల్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అలాగే పైస్థాయి ఉద్యోగులైతే కిందిస్థాయికి దిగజారే వీలున్నది. సీనియర్ ఉద్యోగులకు పదోన్నతులు దక్కకపోవచ్చు. వేతనాలు, ఇతర అలవెన్సుల్లో కోతలుపడే అవకాశాలూ లేకపోలేదు. ఇక ఏడాది కాలవ్యవధిలో ప్రతీ ఉద్యోగి నేరుగా క్లైయింట్ లేదా ప్రాజెక్టుతో కనీసం 225 రోజులు తప్పక పనిచేయాల్సి ఉంటుంది. మిగతా సమయాన్ని ఇంటర్నల్ టాస్క్‌లు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఏఐ-క్లౌడ్ టెక్నాలజీ వంటి కొత్త సాంకేతికతల్ని అందిపుచ్చుకోవడం, ఇతర కార్యకలాపాల కోసం వెచ్చించవచ్చు.

**ఉద్యోగులేమంటున్నారు?**

కొత్త పాలసీతో తాము విపరీతమైన ఒత్తిడిలోకి వెళ్లిపోతున్నామని టీసీఎస్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిక్షణలో తాము నేర్చుకున్న పనుల్లోకి కాకుండా వేరే బాధ్యతల్ని అప్పగిస్తున్నారని వాపోతున్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగ భద్రత, పదోన్నతులు, ప్రాజెక్టుల కేటాయింపుల వంటి అంశాల్లో వారికి దిగులు పట్టుకుంటున్నది. 'వినియోగం ఆధారంగా ఉద్యోగుల్ని హేతుబద్ధీకరించడం ఇదే తొలిసారి. ఉద్యోగాల తొలగింపునకే ఇది దారితీయగలదు' అని సోషల్ మీడియా వేదిక రెడిట్‌లో ఓ టీసీఎస్ ఉద్యోగి పేర్కొన్నారు. అలాగే 'టీసీఎస్‌లో నేను ఇటీవలే చేరాను. జావాలో శిక్షణ పొందుతున్నాను. కానీ నెల రోజులు కూడా కాకముందే అందుకు భిన్నం గా సపోర్టింగ్ ప్రాజెక్టులో చేరాలన్న ఒత్తిళ్లు వస్తున్నాయి' అని మరో ఉద్యోగి చెప్తున్నారు.

**ఉద్యోగ సంఘాల మాట..**

టీసీఎస్ కొత్త విధానంపై ఐటీ ఎంప్లాయీస్ యూనియన్.. నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనెట్ (ఎన్ఐటీఈఎస్) తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం జోక్యాన్ని కోరుతూ కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాకు ఓ లేఖను కూడా రాసింది. కంపెనీ పాలసీ అమానవీయంగా ఉందని, ఉద్యోగులు మానసిక క్షోభకు గురయ్యేలా చేస్తున్నదని, ఈ తరహా కఠిన విధానాలను అడ్డుకోవాలని ఇందులో ఎన్ఐటీఈఎస్ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలుజా కోరారు. నిజానికి టీసీఎస్ నూతన విధానం.. పనిచేయని ఉద్యోగులపైనేగాక, నైపుణ్యం ఉండి కూడా తాత్కాలికంగా ప్రాజెక్టులు దొరకని ఉద్యోగుల్నీ శిక్షించేలా ఉందన్నారు. అయితే చాలామంది ఉద్యోగులు ప్రాజెక్టుల్ని ఏండ్ల తరబడి తిరస్కరిస్తూ సొంత పనుల్ని చేసుకుంటున్నారని.. అలాంటివారిని వదిలించుకొని, సమర్థులకు అవకాశాలు రావాలంటే కంపెనీ పాలసీ సరైనదేనంటున్న ఉద్యోగులూ ఉంటున్నారు.



## ఏటీఎం ఆలోచన ఎలా పురుడుపోసుకుందో తెలుసా?

ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ దీని గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అంతగా మన రోజువారీ జీవితాల్లో భాగమైపోయింది. డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరిగిన ఈ కాలంలోనూ.. ఇవి లేని రోజుల్ని ఊహించడం కష్టం. బ్యాంకు లైన్‌లో గంటల తరబడి క్యూలో నిల్చొనే అవసరం లేకుండా చేసిన ఈ యంత్రం ఆవిష్కరణ నిజంగా మానవాళికి దొరికిన వరమనే చెప్పాలి. అలాంటి ఈ మెషీన్ రూపొందించాలన్న ఆలోచన ఎలా పురుడుపోసుకుందన్నదీ ఆసక్తికరమే. దాని వెనుకా ఓ కథ దాగుంది. 1967లో లండన్‌లో తొలి ఏటీఎం ఏర్పాటైంది. బార్‌క్లేస్ బ్యాంక్ బ్రాంచ్ బయట దీన్ని ఏర్పాటు చేశారు. బ్రిటిష్ టీవీ నటుడు రెగ్ వార్నీ అప్పట్లో ప్రారంభించారు. తొలినాళ్లలో ఈ ఏటీఎం నుంచి గరిష్ఠంగా 10 పౌండ్లు మాత్రమే ఉపసంహరించుకోవడానికి వీలుండేది. క్యూలో గంటలు గంటలు నిల్చుని బ్యాంకులో నగదు ఉపసంహరించుకోవడంతో పోలిస్తే ఇది పెద్ద మొత్తమనే చెప్పాలి. అలా బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చిన ఏటీఎంలు.. నేడు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. జాన్ షెఫర్డ్ బారన్ అనే వ్యక్తి ఈ ఏటీఎంను రూపొందించారు. లండన్‌లోని ఓ బ్యాంకు వద్ద నగదు కోసం ప్రజలు పోటీపడడాన్ని షెఫర్డ్ గమనించారు. నగదు అవసరమైనప్పుడు తాను వ్యక్తిగతంగా ఇబ్బంది ఎదుర్కొన్నారు. తన స్వీయ అనుభవం బ్యాంకు గంటలకు మించి నగదును అందుబాటులో ఉంచే యంత్రం గురించి ఆలోచించేలా చేసింది. ఈ క్రమంలో చాక్లెట్ బార్‌లను విక్రయించే వెండింగ్ మెషీన్ ఆయనకు గుర్తొకొచ్చింది. చాక్లెట్ల స్థానంలో నగదు ఎందుకు ఉండకూడదన్న ఆలోచన చేశారు. ఈ ఆలోచనతో 24/7 నగదు ఉపసంహరణకు అనుమతించే ఒక యంత్రాన్ని రూపొందించారు. అలా రూపుదిద్దుకున్న క్యాష్ మెషీనే.. నేడు ఏటీఎంగా మారింది.ఇంకో విషయం ఏంటటే స్కాట్‌లాండ్‌కు చెందిన జాన్ షెఫర్డ్ బారన్ పుట్టింది భారత్‌లోనే. ఆయన తల్లిదండ్రులు బ్రిటిషర్లు. ఉద్యోగరీత్యా ఆయన తండ్రి బ్రిటిష్ ఇండియాలో విధులు నిర్వర్తించారు. 1925 జూన్ 23న నేటి మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో షెఫర్డ్ జన్మించారు. ఆయన జ్ఞాపకార్థం ఆస్పత్రి వెలుపల 2021 ఆగస్టులో ఎస్‌బీఐ ఓ ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. భారత్‌లో ఏటీఎం ప్రస్థానం 1987లో ప్రారంభమైంది. ముంబయిలో హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు శాఖలో తొలి ఏటీఎం ఏర్పాటైంది. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయం ఇక్కడే ప్రారంభమైంది.


## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బొనాంజా!!

### తొలిసారిగా బోనస్ ఇష్యూ 1:1 నిష్పత్తిలో జారీ
### రూ. 5 ప్రత్యేక మధ్యంతర డివిడెండ్
### క్యూ1లో లాభం రూ. 16,258 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ షేర్‌హోల్డర్లకు బంపర్ బొనాంజా ప్రకటించింది. తొలిసారిగా బోనస్ షేర్లు జారీ చేయనుంది. 1:1 నిష్పత్తిలో షేరు ఒక్కింటికి ఒక షేరు చొప్పున కేటాయించనుంది. ఇందుకోసం ఆగస్టు 27ని రికార్డు తేదీగా నిర్ణయించారు. ఇష్యూని బోర్డు ఆమోదించిన రెండు నెలల్లోగా, అంటే సెప్టెంబర్ 18లోగా బోనస్ షేర్లు క్రెడిట్ అవుతాయని బ్యాంకు వెల్లడించింది.సుమారు రూ. 766.79 కోట్ల విలువ చేసే షేర్లను బ్యాంకు జారీ చేయనుంది. జూన్ క్వార్టర్ ఆఖరు నాటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 2 లక్షల వరకు ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్ గల చిన్న రిటైల్ షేర్‌హోల్డర్లు 36 లక్షల పైగా ఉన్నారు. వీరి వాటా సుమారు 10.32 శాతం వరకు ఉంటుంది. గతంలో 2011లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10 ముఖ విలువ చేసే షేర్లను రూ. 2 ముఖ విలువ చేసే అయిదు షేర్లుగా విభజించింది. ఆ తర్వాత 2019లో వాటిని రూ. 1 ముఖ విలువ చేసే రెండు షేర్లుగా విడగొట్టింది. కంపెనీ షేరు ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 10 శాతం పెరిగి బీఎస్ఈలో ప్రస్తుతం రూ. 1,957 వద్ద ఉంది. బీఎస్ఈ రికార్డుల ప్రకారం బ్యాంక్ ఇప్పటివరకు ఎన్నడూ బోనస్ షేర్లు ప్రకటించలేదు. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 1 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై రూ. 5 చొప్పున ప్రత్యేక మధ్యంతర డివిడెండ్‌ను కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. దీనికి జూలై 25 రికార్డు తేదీగా ఉంటుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.

# బోనమెత్తిన వడ్డేపల్లి






### వైభవోపేతంగా ఆషాడ బోనాలు
### డప్పు వాయిద్యాలు.. శివశత్తుల పూనకాలు
### బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న రాజకీయ నాయకులు

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 20:** ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని బోనాల ఉత్సవాల్లో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గం హత్నూర, మండలం వడ్డేపల్లి గ్రామంలో శ్రీ నల్ల పోచమ్మ తల్లి అమ్మవారికి బోనాల ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాలకు గ్రామంలోని పెద్దలు, రాజకీయ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు. అంతకుముందు గ్రామంలో మహిళలు ఉదయాన్నే పిండి వంటలు నైవేద్యంగా చేసుకొని అమ్మవార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలను భక్తి శ్రద్ధలతో డప్పు వాయిద్యాల నడుమ శివశత్తుల పూనకాలతో కన్నుల పండుగ గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో గ్రామంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను సంతోషంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడి వతన్ దారులు, ప్రజలు, భారీగా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి లో ఘనంగా బోనాల పండుగ

### పాపిరెడ్డిగారి రఘునందన్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్పల్లి మున్సిపల్లో ఆదివారం 13 వ వార్డులో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.బోనాలు, నైవేద్యాలు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా రాధునందర్ రెడ్డి మాట్లాడుతూ తల్లీ పిల్లలు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకున్నారు. పంటలు బాగా పండేలా, వర్షాలు పడి పాడి పంటలు పండాలని కోరుకున్నారు. అమ్మవారు, ప్రజల కష్టాల్లో తోడుగా ఉండాలని వేడుకున్నారు.



## హాజ్ యాత్రకి వెళ్తున్న ముస్లిం సోదరులు

### పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు



**పెబ్బేరు జూలై20 (క్రైమ్ మిర్రర్):** అల్లా ఆశీస్సులతో హాజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హాజ్ యాత్రకు బయలుదేరుతున్న ఎండి. ఇబ్రహీం సాహెబ్,ఎండి సోహేల్ లను ఆదివారం పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశం, రాష్ట్రం,పెబ్బేరు ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారో గ్యాతో నిండు నూరేళ్లు జీవించాలని అల్లాను ప్రార్థించాలని కోరారు. 41 రోజుల పాటు యాత్ర సాగించే వారు ఆరోగ్యపరంగా, ఇతరత్రా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బూరమోని రాములు యాదవ్,దయాకర్ రెడ్డి,వెంకటరమణ, సర్వేష్,నరేందర్,ఎండి. షకిల్,భాషా,శివకుమార్,జ ాంగిర్,నరసింహ,సత్యనారాయణ రెడ్డి,బలరాం నాయక్,శ్రీరాములు,గంధం ఉత్తమ్,బద్రు,శివ తదితరులు పాల్గొన్నారు

# రాంపూర్[కలన్] గ్రామంలో ఘనంగా బోనాల పండుగ





**పిట్లం క్రైమ్ మిర్రర్ :** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం రాంపూర్(కలన్) గ్రామంలో ఆదివారం దుర్గామాత బోనాల పండుగను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామం నుండి గ్రామ మహిళలు ఎత్తుకొని డీజే సప్పుల మధ్య,భాజా భజంత్రీల నడుమ రాంపూర్(కలాన్),కుర్తీ గేటు వద్ద గల దుర్గామాత ఆలయం వద్దకు గ్రామ ప్రజలు కాలినడకన వెళ్లి బోనాలను సమర్పించి,ప్రత్యేక పూజలు చేసిన అనంతరం,నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు మందడి బాల్ రెడ్డి మాట్లాడుతూ....దుర్గామాత బోనాల పండుగను ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహిస్తామని,ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి,గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దుర్గామాత అమ్మవారిని కోరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజి సర్పంచ్ మందడి నారాయణరెడ్డి,మాజీ ఎంపీటీసీ సునీత బలరాం రెడ్డి,గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోడు భూముల రగడ..

### పోలీసులపై ముల్తానీల రాళ్ల దాడి
### ఎస్సైతో పాటు మరో నలుగురికి గాయాలు
### ఇచ్చోడ మండలంలో ఘటన

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో పోడు గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. పోడు భూము ల్లో అటవీశాఖ మొక్కలు నాటడాన్ని ముల్తానీలు వ్యతిరేకించారు. కేశవపట్నం, సడక్‌గూడ గ్రామాల మధ్యలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో పోలీసులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. మహిళలు, పురుషులు, పిల్లలు దాదాపు 200 మంది వరకు రాళ్లు కర్రలతో మూకుమ్మడిగా దాడికి దిగారు. ఈ ఘట నలో ఇచ్చోడ ఎస్సై పురుషోత్తంతో పాటు నలుగురు సిబ్బంది గాయపడ్డారు. వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. నాలుగు రోజులుగా సిరిచెల్మ అటవీ ప్రాంతంలోని చెలుకగూడ వద్ద ముల్తానీలు సాగు చేస్తున్న పోడు భూముల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నారు. ఆదివారం కూడా సిబ్బందితో కలిసి బందోబస్తు మధ్య అక్కడికి చేరుకున్నారు. మరికొంతమంది అటవీ సిబ్బంది, పోలీసులు సిరిచెల్మ ఘాట్‌పై సడక్‌గూడ వద్ద వేచి ఉన్నారు. ఈక్రమంలో కేశవపట్నం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భర్త అల్తాఫ్ స్థానిక ఎస్సై పురుషోత్తంకు ఫోన్ చేసి గ్రామస్తులతో మాట్లాడదామని పిలిచారు. దీంతో ఎస్సై ఇద్దరు సిబ్బందితో కలిసి కేశవపట్నం వైపు వెళ్లారు. అప్పటికే గ్రామస్తులు గాయిద్‌పల్లి రోడ్డు వద్ద వేచి ఉన్నారు. వాహనంలో నుంచి దిగిన ఎస్సై, సిబ్బందిని ముల్తా నీలు చుట్టుముట్టి దాడికి పాల్పడ్డారు. ఎస్సై చేతికి గాయమవగా.. వీడియో తీస్తున్న కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను లాక్కొని రాయితో తలపై కొట్టారు. పోలీసు వాహనంపై రాళ్లు వేయడంతో అద్దాలు పగిలిపోయాయి. అప్రమత్తమైన ఎస్సై మిగతా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకునేలోపు ముల్తానీలు పరారయ్యారు. 20 నిమిషాల తర్వాత పొలాల వైపు నుంచి వచ్చిన ముల్తానీలు సిబ్బందిపై మరోసారి రాళ్లతో దాడికి దిగారు. ఘటనలో మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. పోలీసులు ఎదురు దాడికి దిగడంతో ముల్తానీలు పారిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెలుకగూడ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని వాయిదా వేశారు.



## రైతుల సమస్యలపై ఎఐకెఎఫ్ ప్రతినిధుల వినతిపత్రం

### వ్యవసాయ మంత్రిని కలిసిన రాష్ట్ర నాయకులు

మిర్యాలగూడ, జూలై 20 (క్రైమ్ మిర్రర్ ): రాష్ట్రంలో యూరియా కొరత, పంట రుణాలు, రుణమాఫీ వంటి కీలక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు సమాఖ్య (ఎఐకెఎఫ్) రాష్ట్ర ప్రతినిధి బృందం శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కలిసింది. ఈ సందర్భంగా వారు మంత్రి గారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎన్.రెడ్డి, హంసరెడ్డి పాల్గొన్నారు. అలాగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్లుఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, పోతుగంటి కాశి, కిరణ్, ఇమ్మానుయేల్ తదితరులు హాజరయ్యారు.రైతులకు గ్యారంటీ ధరలు, విత్తనాలు, ఎరువులు సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వారు ఎత్తిచూపారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

## బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

### బిఎస్పి పార్టీలో చేరికలు షురూ, దౌల్తాబాద్ లొ ముఖ్య కార్యకర్తలు సమావేశం
### హత్నూర బిఎస్పి అధ్యక్షుడు గా యాదగిరి ఎన్నిక





హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 20: బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పని చేయడానికి నర్సాపూర్ నియోజకవర్గ యువత బిఎస్పి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆదివారం బిఎస్పి పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్ల జనార్ధన్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హత్నూర మండల అధ్యక్షుడిగా దౌల్తాబాద్ కి చెందిన యాదగిరిని అధిష్టానం నీయమించిందని గౌడ్ తెలిపారు. బహుజన రాజ్యం బిఎస్పి తోనే సాధ్యమని నమ్మి కౌడిపల్లి మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్, దుర్గేష్, అనిల్, నర్సింలు, పి. సురేష్, జె. ప్రభు, జె. అనిల్ కుమార్, పి. నరసింగరావు, క్రిష్ణ, వి. మహేష్, పి. ఈశ్వర్, హరీష్ కుమార్, పి. జోగయ్య, పి. వీరేశ్, భరత్ కుమార్, పి. విశిత్, జె. రవి, వి వీరేశం, నాగుల్ దేవుల పల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## గోపులారంలో ఘనంగా బోనాల పండుగ


### పొడువు శ్రీనివాస్ గోపులారం మాజీ సర్పంచ్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఆదివారం గోపులారం లో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాలు బోనాలను డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు భక్తులు పాల్గొన్నారు.



# నవ్వులు.. అల్లర్లు ఇంకాస్త ఆలస్యం

బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్, మృణాల్ ఠాకూర్ జంటగా 'సన్ ఆఫ్ సర్దార్ 2' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్, టీజర్‌లు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ నెల 25న ఈ చిత్రం రానున్నట్లు ఇప్పటికే వెల్లడించాయి సినీ వర్గాలు. ఇప్పుడు దీని కోసం అభిమానులు మరిన్ని రోజులు వేచి చూడాల్సిందే. తాజాగా కొన్ని కారణాల వల్ల ఈ చిత్రాన్ని ఆగస్టు 1న విడుదల చేయనున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. "నవ్వులు.. అల్లర్లకు ఇంకాస్త ఆలస్యం కానుంద"నే వ్యాఖ్యను జోడించింది. సంజయ్ మిశ్రా, ముకుల్ దేవ్, రవి కిషన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.






# 'భళ్లాలదేవ' నేనే చేయాల్సింది..

## అందుకే ఆ పాత్ర వద్దనుకున్నా: జయసుధ తనయుడు

సినీ ప్రేక్షకులను విశేషంగా అలరించిన చిత్రాల్లో 'బాహుబలి' ఒకటి. ప్రభాస్, రానా, అనుష్క, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ కీలక పాత్రల్లో రూపొందిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఎస్.ఎస్.రాజమౌళి విజువల్ వండర్‌గానూ ప్రశంసలు అందుకుంది. ఇందులో ప్రతినాయకుడు భళ్లాలదేవుడి పాత్రలో రానా నటించి మెప్పించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ పాత్ర కోసం నటి జయసుధ తనయుడు నిహార్ కపూర్‌ను కూడా చిత్ర బృందం ఎంపిక చేసిందట. రెండు, మూడు వారాల పాటు 'బాహుబలి' మూవీ కోసం శిక్షణ తరగతులకు కూడా హాజరైనట్లు నిహార్ తాజా ఇంటర్వ్యూలో పంచుకున్నారు."మొదట భళ్లాల దేవుడి పాత్రను రానానే చేయాల్సింది. ఆయన డేట్స్ కుదరకపోవడం వల్ల నన్ను సంప్రదించారు. నేను ఓకే చెప్పాను. దాదాపు నాలుగు వారాలు ట్రైనింగ్ సెషన్స్‌లోనూ పాల్గొన్నా. ఆ తర్వాత 'ఈ పాత్ర రానా చేస్తానని చెప్పారు. మీరు కాలకేయ పాత్ర చేస్తారా' అని చిత్ర బృందం అడిగింది. నేను ఆలోచనలో పడ్డా. కాలకేయుడి పాత్రకు సంబంధించిన ఒక క్యారికేచర్ చూపించారు. పాత్ర డిజైనింగ్ ఇలా ఉంటుందని వివరించారు. ఎక్కువగా ప్రోస్థటిక్ మేకప్ వేశారు. ఇదే విషయాన్ని అమ్మ వద్ద ప్రస్తావిస్తే, 'నీ మొదటి సినిమా ఫేస్ కూడా సరిగా కనిపించటం లేదు. బాడీ కూడా కవర్ అయిపోతోంది. ప్రేక్షకులు గుర్తించరు' అని సలహా ఇచ్చారు. దాంతో చేయనని చెప్పా. ఆ పాత్రను నటుడు ప్రభాకర్ చేశారు. క్యారికేచర్‌తో పోలిస్తే, తెరపై ఆ పాత్ర పూర్తిగా మారిపోయింది. ఇది చిన్న విషయం కాకపోయినా ఆ పాత్ర చేయనందుకు నేనేమీ బాధపడలేదు. మొదటి నుంచి దర్శకుడు రాజమౌళినే అన్ని విషయాలు నాతో నేరుగా మాట్లాడారు. ఆ తర్వాత సరదాగా రమ్మని షూటింగ్‌కు రమ్మని పిలిస్తే, రెండుసార్లు వెళ్లాను" అని నిహార్ వివరించారు. 'బాహుబలి' విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా మూవీ రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే సినిమాగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. అక్టోబరు 31న 'బాహుబలి: ది ఎపిక్'ను విడుదల చేయనున్నారు.



# బర్త్‌డే రోజు భర్తని ముద్దులతో ముంచెత్తిన ప్రియాంక చోప్రా.. ఫొటోలు వైరల్

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనాస్ తన 43వ పుట్టినరోజును బీచ్ గెట్‌అవేలో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తన భర్త నిక్ జోనాస్, ముద్దుల కూతురు మాల్తీ మేరీతో కలిసి ఆమె ఈ ప్రత్యేకమైన రోజును ఆనందంగా గడిపారు. ఈ వేడుకకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకోగా.. బర్త్‌డే రోజు నిక్‌ని ముద్దులతో ముంచెత్తింది ప్రియాంక. మరోవైపు నిక్ జోనాస్, మాల్తీ మేరీతో కలిసి బీచ్‌లో సరదాగా గడుపుతున్న ఫోటోలు మరియు వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినిమాల విషయానికి వస్తే.. ప్రియాంక చోప్రా ప్రస్తుతం పలు అంతర్జాతీయ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మహేష్ బాబుతో కలిసి రాజమౌళి దర్శకత్వంలో రాబోయే '%యాఎస్ఎంబీ%29' చిత్రంలో కూడా ఆమె నటిస్తున్నారు. పనిలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, తన కుటుంబానికి సమయం కేటాయించడంలో ప్రియాంక ఎప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపించారు.

# షారుఖ్‌కు గాయాలు షూటింగ్ వాయిదా

బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్‌ఖాన్ గాయాలపాలయ్యారట. ప్రస్తుతం ఈ వార్త బీటౌన్లో ఓ స్థాయిలో హల్‌చల్ చేస్తున్నది. ప్రస్తుతం ఆయన 'కింగ్' అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్‌లో జరిగిన ప్రమాదంలో షారుఖ్ గాయపడ్డట్టు సమాచారం. ఓ యాక్షన్ సన్నివేశంలో డూప్ లేకుండా నటిస్తుండగా ఆయన గాయాలపాలయ్యారట. గాయానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది. అత్యవసర చికిత్స నిమిత్తం షారుక్ అమెరికా వెళ్లినట్టు వస్తున్న వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో షారుఖ్‌కు తగిలిన గాయం తీవ్రమైనది కాదని, అది కేవలం కండరాల గాయం మాత్రమేనని చిత్ర వర్గాలు తెలియజేశాయి. ఈ కారణం వల్ల 'కింగ్' షూటింగ్ సెప్టెంబర్‌కు వాయిదా వేశారట. షారుఖ్ కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె తల్లిగా రాణీ ముఖర్జీ కనిపించనున్నారట. ఈ యాక్షన్ ఎంటైర్టైనర్‌కి సిద్ధార్థ్ ఆనంద్ దర్శకుడు.





# బుర్రకథ శిఖామణి జీవితంపై సినిమా

నిజజీవిత కథలు, సంఘటనలు స్ఫూర్తిగా తీసుకుని తెలుగులో ఎప్పటికప్పుడు సినిమాలు తీస్తూనే ఉంటారు. ఇప్పుడు అలా రాబోతున్న మరో మూవీ 'గరివిడి లక్ష్మి'. చాన్నాళ్ల క్రితమే ఈ చిత్రం నుంచి 'నల్లజీలకర్ర మొగ్గ' అని సాగే ఓ పాటని రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు గ్లింప్స్ విడుదల చేశారు. ప్రధాన పాత్రధారిని పరిచయం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో బుర్రకథ అంటే తెలియని వారుండరు. పండగలు, ఉత్సవాల టైంలో బుర్రకథల్ని ఎక్కువగా వేస్తుంటారు. 90ల కాలంలో దాదాపు 15 ఏళ్లలో ఏకంగా 10 వేలకు పైగా ప్రోగ్రామ్స్ చేసి గుర్తింపు తెచ్చుకున్న గరివిడి లక్ష్మి అనే ఆమె జీవితం ఆధారంగా ఈ సినిమా తీసినట్లు చిత్రబృందం ఇప్పుడు క్లారిటీ ఇచ్చింది. గ్లింప్స్ కూడా సింపుల్‌గానే ఉంది. లక్ష్మి పాత్రలో ఆనంది నటించబోతుంది. ఇదివరకే ఈమె.. జాంబీరెడ్డి, భైరవం తదితర సినిమాల్లో నటించింది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.